హైదరాబాద్ వార్త



ఊరెళ్తే..

# ఇంటి భద్రతకు చర్యలేవి?



ఊరెళ్తున్నారా.. జాగ్రత్తలు పాటించండి.. బయటికి వెళ్ళే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం అలాగే స్టేటస్‌లు పెట్టొద్దు.. షాపింగ్ మాల్‌లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి.. ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవాలి.. కాలనీలలో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలి.. కొత్త వ్యక్తుల కదలికలపై 100కు డయల్ లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారమివ్వాలి.. సహజంగా ఇవన్నీ పోలీసు అధికారులు చేసే సూచనలు.. కానీ పోలీసులు ఇలాంటి సందర్భాల్లో ప్రజలు ఊర్లకు భయలుదేరే సమయాల్లో భద్రత చర్యలు కట్టుదిట్టం చేసి ఎన్ని కేసుల్లో నిందితులను పట్టుకున్నారు. ఇప్పటి వరకు ఎన్ని కేసులు రికవరీ చేశారు అన్న ప్రశ్నలపై కూడా ప్రజల్లో సందేహాలు తలెత్తుతున్నాయి.

## సూచనలేనా..? పోలీసుల భద్రత చర్యలేవి?

ఊరెళ్తున్నారా.. ఇల్లు జాగ్రత్త!

నగలు, విలువైన వస్తువులు,

లాకర్లలో ఉంచాలంటున్న పోలీసులు

ఇప్పటికే నగరంలోకి దొంగల ముఠాలు

సమాచారం ఇస్తే గస్తీ ముమ్మరం

అనుమానం వస్తే డయల్-100కు ఫోన్ చేయాలి

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. ఇప్పటికే దొంగల ముఠాల కళ్లన్నీ హైదరాబాద్‌పైనే ఉంటాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఊరికి వెళ్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పండుగ సెలవులతో చాలా మంది ప్రయాణాలు చేస్తారని, ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారని అంటున్నారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామని పోలీసులు పేర్కొంటున్నారు.

హైదరాబాద్, జనవరి 10 ప్రభాత వార్త : సైబరాబాద్ కమిషనరేట్‌లో పోలీసులు నిఘానేత్రం కింద ప్రజలు, కార్పొరేట్ కంపెనీల సిఎస్ఆర్ సహకారంతో ఇప్పటికే సిసిటివీలను ఇన్‌స్టాల్ చేశారు. తద్వారా ఎన్నో సంచలనాత్మక నేరాలను ఛేదించారు. ప్రజలు తమ కాలనీలు, ఇళ్ళ, పరిసరాలు, షాపింగ్ మాళ్లలో సిసి కెమెరాలు అమర్చుకోవాలివిలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కారులలో పెట్టడం చేయరాదు. ద్విచక్రవాహనాలు, కారులను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి, రోడ్లపై నిలుపరాదు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు. తమతోపాటే తీసుకెళ్లాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి. గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉండాలి. ఎక్కువ రోజులు విహారయాత్రల్లో ఉంటే పేపర్, పాల వారిని రావద్దని చెప్పాలి. పని మనుషులు ఉంటే రోజూ వాకిలి ఊడ్చమని చెప్పాలి. విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. విలువైన వస్తువుల సమాచారాన్ని ఇతరులకు చెప్పకూడదు. ఆరుబటయ వాహనాలకు హాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేయాలి. వాచ్‌మెన్, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

**బంగారం నగలు లాకర్లలో భద్రపరచడం మేలు..** ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లెవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి. టైమర్‌తో కూడిన లైట్లను ఇంట్లో అమర్చుకోవాలి. బ్యాగుల్లో బంగారు నగలు డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గరలో పెట్టుకోవాలి. బ్యాగు బస్సులో పెట్టి కిందికి దిగితే దొంగలు అపహరిస్తారు.

**ఇంటి డోర్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవడం సురక్షితం..**

స్మార్ట్ ఫోన్ ద్వారా మానిటరింగ్ చేసుకునే విధంగా టెక్నాలజీ ఉపయోగించుకోవాలి. హోమ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా ఇంటర్నెట్ అనుసంధానం ఉన్న మీ మొబైల్ నుంచే మీ ఇంటిని ఎక్కడి నుంచి అయినా లైవ్, ప్రత్యక్షంగా చూసుకునే వీలుంది. ఇంటికి సంబంధించిన నాణ్యమైన సిసిటివిలు (షాయోమీ వంటి కంపెనీలు తక్కువ ధరకే) ఆన్లైన్, మార్కెట్‌లో అందుబాటులో ఉనా న్నయి. హోమ్ సెక్యూరిటీ సర్వైలెన్స్‌కు ఇవి ఎంతో ఉపయుక్తం రూ.కోట్లు ఖర్చు చేసిన ఖరీదైన ఇళ్లను నిర్మించుకున్న వారు తాళం విషయంలో విఫలమవుతుంటారు. అలా కాకుండా ఇంటికి సెంట్ర ల్ లాకింగ్‌తోపాటు అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలి. ఇంటి భద్రతాపరంగా ఇంటికి దృఢమైన, నాణ్యమైన తలుపులతో పాటు హై ఎండ్ గోద్రెజ్ హై సెక్యూరిటీ లాక్ సిస్టంని వాడడం మంచిది. తాళం వేయడం కంటే గోద్రెజ్ డోర్ లాక్ చేయడం వల్ల ఇంట్లో మనుషులు ఉన్నారా?లేరా? అనేది తెలియదు. సొంత ఇల్లు అయినట్లయితే ఇంటి ప్రధాన ద్వారానికి గ్రిల్స్ అమర్చుకోవడం ద్వారా రెండంచెల భద్రతనిస్తుంది. ఇంట్లో, ఇంటి బయట మోషన్ సెన్సర్‌లను ఉపయోగించడం మంచిది. ఇంటి బయట మోషన్ సెన్సర్ లైట్లను ఉపయోగించండి. ఇవి చీకటీ ఉన్నప్పుడు మాత్రమే పని చేస్తాయి. సెన్సార్లు పరిసరాల్లో ఏదైనా కదలిక గుర్తించగానే లైట్ వెలుగుతుంది. సాధారణంగా సరైన భద్రతా ప్రమాణాలు పాటించని ఇండ్లు, చీకటి ప్రదేశం, పాత గ్రిల్స్, బలహీనమైన తాళాలు ఉన్న ఇండ్లలో దొంగలు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి..** ప్రజలు తమ ప్రాంతంలో గస్తీ ఏర్పాటుకు సహకరించాలి. పోలీసుస్టేషన్ నెంబర్, వీధుల్లో వచ్చే బీట్ కానిస్టేబుల్ నెంబర్ దగ్గర పెట్టుకోవాలి • ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభం • అనుమానిత వ్యక్తుల కదలికలను గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి • ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లేటప్పుడు చుట్టు పక్కల వారికి లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి • నమ్మకమైన సెక్యూరిటీ గార్డులను, వాచ్ మెన్‌ను నియమించుకోవాలి. కాలనీవాళ్లు కమిటీలు వేసుకొని వాచ్‌మెన్లను, సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి • రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వచ్చినా వారి వివరాలు తెలుసుకొని రిజిస్టర్‌లో నమోదు చేసుకోవడం మంచిదని అపార్టుమెంట్ వాచ్‌మెన్‌లకు తెలపాలి • ఎప్పుడు కూడా స్థానిక పోలీసు స్టేషన్ నెంబర్ దగ్గరుంచుకోవడం మంచిది • దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి • దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊర్లెళ్లిన వారి ఇళ్లపై నిఘాను ఏర్పాటు చేస్తారు • కాలనీలో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను నిర్వహించుకోవాలి.

# నష్టాలపై డిస్కం ఫోకస్



ఫీడర్ల వారిగా ఎనర్జీ ఆడిట్

సరఫరా యూనిట్లు.. బిల్లింగ్‌ల తేడా లెక్కింపు

బిల్లులు పూర్తిస్థాయిలో వసూలయ్యేలా ప్రణాళికలు

ఇండస్ట్రియల్ ఫీడర్లపై ప్రత్యేకమైన దృష్టి

చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరికలు

హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త: గ్రేటర్‌లో విద్యుత్ సరఫరా నష్టాలు తగ్గించేలా డిస్కం చర్యలు మొదలుపెట్టింది. విద్యుత్ డిమాండ్‌కు పెరుగుతున్న క్రమంలో సరఫరా నష్టానలు తగ్గించేలా సర్కిళ్ల పరిధిలో ఫీడర్ల వారిగా ఎనర్జీ ఆడిట్ చేపట్టనున్నారు. గ్రేటర్‌జోన్ పరిధిలో రోజు50-55మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతుంది. వేసవిలో విద్యుత్ వినియోగం 60-70ఎంయుల వరకూ చేరుతుంది. విద్యుత్ వినియోగం పెరుగుతున్న క్రమంలో సరఫరా నష్టాలు పెరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా చేస్తున్న యూనిట్లుతో పోల్చితే వసూలవుతున్న బిల్లులు తక్కువగా ఉంటున్నాయి. సర్కిళ్లలో సరఫరా అధికంగా నమోదవుతున్నా..కొంతమంది అధికారులు సాంకేతిక నష్టాల రూపంలో వాటిని చూపిస్తు చేతులు దులుపుకుంటున్నారు. విద్యుత్ సరఫరాలో నష్టాలను తగ్గించుకునేందుకు ఇప్పటికే గ్రేటర్ జోన్ పరిధిలోల వేల సంఖ్యలో డిస్ట్రిబూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను పెంచుతున్నారు. విద్యుత్ స్థంబాల మధ్య దూరం తగ్గించడంతోపాటు పలు ప్రాంతాల్లో కొత్తలైన్లను అందుబాటులోకి తెస్తున్నారు. సబ్‌స్టేషన్ల నుండి డిస్ట్యూబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఎన్నియూననిట్లు విద్యుత్ సరఫరా అవుతుంది. డీటీఆర్‌ల నుండి కమర్షియల్ డొమెస్టిక్ కనెక్షన్లకు ఎన్నియూనిట్లు వెళ్తుందో లెక్కకడుతూ ఫీడర్ల వారిగా ఎనర్జీ ఆడిట్ చేపట్టనున్నారు

**తొమ్మిది సర్కిళ్లలో నాలుగింట నష్టాలే..** అప్పుల భారం మోస్తున్న విద్యుత్‌శాఖ గ్రేటర్‌లోని కొన్ని డివిజన్లలోని నష్టాలు గుదిబండగా మారాయి. గత ఆర్థిక సంవత్సరంలో నష్టాలు స్వల్పంగా తగ్గినా ..ఈఏడాది మళ్లీ పెరగడం నిర్వాహణ వైఫల్యాలను సూచిస్తుంది. గ్రేటర్ పరిధిలో తొమ్మిది సర్కిళ్లు ఉండగా అందులో నాలుగు సర్కిళ్లలో అఅధికంగా సాంకేతిక ,వాణిజ్య నష్టాలు ఉన్నాయి. హైదరాబాద్ సౌత్‌లో అత్యధికంగా 41.4శాతం నష్టాలు ఉండగా..హైదరాబాద్ సెంట్రల్‌లో 12.8, రాజేంద్ర నగర్‌లో 9.25 శాతం సాంకేతిక నష్టాలు ఉన్నాయి. అయితే ఈనష్టాలు రెండు రకాలుగా కనిపిస్తున్నాయి. విద్యుత్ సంస్థ సరఫరా చేసిన కరెంట్ వినియోగదారుడికి చేరేసరికి కొంత వ్యత్యాసం వస్తుంది. దీన్ని సాంకేతిక నష్టాలుగా చూపుతుంటారు. బిల్లింగ్‌లో బకాయిలు, వసూళ్లలలో నిర్లక్ష్యం కారణంగా వచ్చే నష్టాలను వాణిజ్య నష్టాలుగా చెబుతుంటారు. ప్రతి మూడు నెలలకోసారి ఎనర్జీ ఆడిట్ విభాగం ఆడిట్ చేసి వీటిని ఆయా సర్కిళ్లు డివిజన్లకు పంపిస్తుంటుంది. అయితే వాటి ఆధారంగా నష్టాలను తగ్గించే పనిచేయాల్సిన అధికారులు అలా చూసి ఇలా పడేస్తున్నారు. అయితే నష్టాలు డివిజన్‌లనే కాదు..ఫీడర్ల వరీగా లెక్కలు ఎనర్జీ ఆడిట్‌లో చూపుతారు. హైదరాబాద్ సౌత్‌లోని కొన్ని సెక్షన్‌లో 70నుంచి 90శాతం నష్టాలు ఉన్న ఫీడర్లు ఉన్నాయి. సిఆర్‌పిఎఫ్, గుల్జార్‌హౌజ్, మైసారం వంటి చోట్ల కరెంట్ సరఫరా చేస్తున్న యూనిట్లకు ..బిల్లింగ్ యూనిట్లకు ఎంతో తేడా ఉంటుంది. వీటిపై దృష్టిపెడితే నష్టాలు తగ్గించడం అసాధ్యమేమీ కాదని పలువురు సీనియర్ ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

అలాగే వాణిజ్య ప్రాంతాల్లో చౌర్యం ఎక్కువగా జరుగుతుందనే ఆరోపణలున్నాయి. కరెంట్ వాడుకుంటున్నా..మీటర్‌లో నమోదు కావడం లేదు. కాలం చెల్లిన పాతనెట్‌వర్క్ ఉండటం కూడా సాంకేతిక నష్టాలకు కారణమని ఇంజనీర్లు చెబుతున్నారు. వందశాతం ఐఆర్‌పోర్ట్ మీటర్లను ఏర్పాటు చేయకపోవడంతో బిల్లింగ్‌లో అక్రమాలకు ఆస్కారం ఉంటోంది. కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది వినియోగదారులతో కలిసి డిస్కంకు నష్టం చేకూరుస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. పలుచోట్ల మీటర్ ట్యాంపరింగ్‌కు ఎక్కువగా పాల్పడుతూ మీటర్ తిరగడకుండా చేస్తున్నట్లు తెలుస్తుంది. బిల్లుల వసూళ్లకు వెళ్తే కొందరు వినియోగదారులపై దాడులకు పాల్పడుతుండగా అలాంటి ప్రాంతాలకు వెళ్లేందుకు సిబ్బంది జంకుతున్నారు.

**సౌత్‌కు పోస్టింగ్ అంటేనేభయం..**డిస్కంలో ఎన్నోఏళ్లుగా హైదరాబాద్ సౌత్‌లో నష్టాలు ఉన్నాయి. ఇక్కడికి పోస్టింగ్ అంటే శిక్షగా భావిస్తుంటారు. ఈభావన పోయేలా సమర్థులైన ఇంజనీర్లు అక్కడ వేయాలి. కార్పొరేట్ కార్యాలయంలో పలువిభాగాల్లో హోదాకు ,సామర్థ్యానికి తగ్గ పనిలేక తీసుకుంటున్న జీతానికి న్యాయం చేయడం లేదని భావనలో కొందరు ఉన్నారు. వీరి సేవలను వినియోగించుకోవాలి. ఉన్నతాధికారులు సమీక్షలు తప్పా క్షేత్రస్థాయిలో వెళ్ళిన సందర్భాలు లేవు. ఈపరిస్థితి మార్చడానికి చర్యలు చేపట్టాలని విద్యుత్‌రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

## దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మర్రి రాఘవయ్య

కంటోన్మెంట్, జనవరి 10 ప్రభాతవార్త : దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సంచాలన్ భవన్ వద్ద బుదవారం రిలే నిరాహార దీక్షను రైల్వే ఉద్యోగులు, కార్మికులు చేపట్టారు. ఈ కార్యాక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంప్లాయిస్ సంఘ్ ప్రధానకార్యాదర్శి డాక్టర్ మర్రి రాఘవయ్య హాజరై కార్మికులు, ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. రైల్వేలో నూతన పింఛన్ విధానాన్ని రద్దు చసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రూల్వే ఉద్యోగులు, కార్మికులపై పని భారం పడకుండా ఉండేందుకు రైల్వేలో ఖాలీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు లెక్కలతో పాత పింఛన్ విధానాన్ని రద్దు చేసి నూనత పింఛన్

మిగతా పేజీలో

## దరఖాస్తుల డేటా ఎంట్రీ సెంటర్లను పరిశీలించిన జిహెచ్ఎంసి కమిషనర్



సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో డేటా ఎంట్రీ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్

సికింద్రాబాద్, జనవరి 10 ప్రభాతవార్తః ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన ప్రతీ దరఖాస్తును అన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో బేగంపేట్, సికింద్రాబాద్ సర్కిల్‌లకు సంబంధించిన దరఖాస్తుల డేటా ఎంట్రీ సెంటర్‌లను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌లను ఒక్కొక్క దరఖాస్తు డేటా ఎంట్రీ చేయడానికి ఎంత సమయం పడుతుందని అడిగారు. కుటుంబ సభ్యుఉ ఎక్కువగా ఉన్న దరఖాస్తులు నమోదు చేయడానికి 10 నుండి 15 నిమిషాలు పడుతుందని, తక్కువ మంది కుటుంబ సభ్యులు ఉనన ఆధార్, పేరు వివరాలు నమోదు చేయడానికి తక్కువ సమయం పడుతుందని కమిషనర్‌కు వివరించారు. 8గంటల షిఫ్ట్ సమయంలో 70 నుంచి 80 దరఖాస్తులు డేటా ఎంట్రీ చేయడం జరుగుతుందని ఆపరేటర్‌లు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తులో ఉన్న విధంగా, అక్షరం తప్పు లేకుండా డేటా ఎంట్రీ చేయాలని సూచించారు. గ్రేటర్ హైద్రాబాద్ పరిధిలో 24లక్షల 74వేల 325 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అందులో 5 హామీలకు సంబంధించిన అభయహస్తం దరఖాస్తులు 19లక్షలకు పైగా ఉండగా రేషన్ కార్డులు ఇతర సమస్యలపై దరఖాస్తులు 5లక్షల 73వేలు ఉన్నట్లు వివరించారు. ఇప్పటి బుధవారం వరకు 6లక్షల 50వేల దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తయినట్లు తెలిపారు. డేటా ఎంట్రీ ప్రభుత్వం నిర్ధేశించిన కాలవ్యవధిలో పూర్తి చేయడానికి సర్కిల్‌ల వారీగా ఎక్కడివి అక్కడే డేటా ఎంట్రీ చేస్తున్నట్లు చెప్పారు. మొత్తం 635 డేటా ఎంట్రీ సెంటర్‌లను ఏర్పాటు చేసి 5వేల మందితో ఎంట్రీ చేయడం జరుగుతుందన్నారు. జీహెచ్ఎంసీ డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు 300 మంది మాత్రమే ఉన్నట్లు, దరఖాస్తుల డేటా ఎంట్రీని ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా చేయడం జరుగుతుందన్నారు. అయితే ప్రైవేట్ ఏజెన్సీ కంప్యుటర్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లను సమకూర్చి ఇవ్వడం చేస్తుంద న్నారు. జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీలు పాల్గొన్నారు.

## కార్మికులకు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తా

**కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య**



చిక్కడపల్లి, జనవరి 10 ప్రభాత వార్త: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి కార్మికులకు ఏ మేరకు సంక్షేమ ఫలాలు అందించే అంశంపై దృష్టిని కేంద్రీకరిస్తానని రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ కమీషనర్ కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కృష్ణ ఆదిత్య బుధవారం ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో కమీషనర్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులకు వారివారి హక్కుల సాధనతో పాటు సరైన న్యాయం జరిగే విధంగా తన నిర్ణయాలు ఉంటాయని, ప్రస్తుతం కార్మిక శాఖలో ఉన్న పరిస్థితిని సమీక్షించుకుని తదనుగుణంగా ముందుకు సాగడం జరుగుతుందని అన్నారు. కార్మికులకు సంబంధించి ఈ శాఖలో 27 యాక్టులున్నాయని, వాటి ప్రకారం కార్మికులకు ఏమేరకు సంక్షేమ ఫలాలు అందించే అంశంపై దృష్టిని కేంద్రీకరించడం జరుగుతుంద న్నారు. కార్మిక శాఖ ప్రస్తుతం మూడు సంక్షేమ బోర్డులు ఉన్నాయని, ఆ బోర్డుల ద్వారా ఏ మేరకు కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఒక సమగ్రమైన ప్రతిపాదన లను పంపించడం జరుగుతందని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ప్రవేశపెట్టిన 'ఈశ్రమ్' కార్యక్రమానికి ఇప్పటి వరకు 41లక్షల మంది పేర్లను నమోదు చేసుకున్నారని, ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ సందర్భం గా పలువురు కార్మిక శాఖ అధికారులు నూత నంగా కమీషనర్‌గా బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా కృష్ణఆదిత్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ధనుర్మాసోత్సవాల సందర్భంగా నేడు కూడారై ఉత్సవం

చిక్కడపల్లి, జనవరి 10 ప్రభాతవార్త: చిక్కడపల్లి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం కూడారై ఉత్సవం ఉంటుందని ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ రామాంజనేయులు వివరించారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా 14న భోగి పండుగ సందర్భంగా రాత్రి ఏడు గంటలకు గోదా సమేత రంగనాథస్వామి వారి కల్యాణం ఉంటుందని, 15న మకర సంక్రమణ పర్వదినోత్సవం సందర్భంగా ఉత్తరాయ పుణ్యకాలం, 16న కనుమ పండుగ సందర్భంగా ఉదయం 11 గంటలకు గోదాఅమ్మవారి కరినోము ఉత్సవాలుంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

## మిస్ అండ్ మిసెస్‌గా హైదరాబాద్‌కు చెందిన శ్రావ్య చిల్ల




సైఫాబాద్, జనవరి 10 ప్రభాతవార్త: ఢిల్లీ, నోయిడాలో జరిగిన అందాల పోటీల్లో సౌత్ ఇండియా క్రౌన్ సాధించి అందాల రాణిగా హైదరాబాద్‌కు చెందిన శ్రావ్య చిల్ల 'మిస్ అండ్ మిసెస్ ఇండియా'గా ఎంపికైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్వీన్ ఆఫ్ హార్ట్స్ సంస్థ నిర్వహించిన అందాల పోటీలలో పాల్గొన్న తాను సౌత్ ఇండియా క్రౌన్‌తోపాటు మిసెస్ ఫిట్, మిసెస్ పర్ఫెక్ట్ బాడీ-2024 వంటి రెండు సబ్ టైటిల్‌ను కూడా సాధించుకోవడం జరిగిందన్నారు. ఫైనల్‌కు 36 మంది ఎంపిక కావడం జరిగిందని, 5 రాష్ట్రాల సౌత్ జోన్ కిరీటం తనను వరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు తాను గత ఆరు నెలలుగా ఫిట్నెస్, క్యాట్‌వాక్, మాట్లాడే విధానం, ప్రశ్నలపై శిక్షణ పొందడం జరిగిందని, తాను టైటిల్ దక్కించుకోవడానికి ఎంతో శ్రమించవలసి వచ్చిందని ఆమె తెలిపారు. తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నానని, ఇద్దరు పిల్లలకు తల్లిని అయినప్పటికి పట్టుదలతో విజయం సాధించానని, తన కుటుంబం ఇచ్చిన సహకారం మరువలేనిదని శ్రావ్య చిల్ల వివరించారు.

## 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' పేదలకు ఎంతో మేలు

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్

హైదరాబాద్ జనవరి 10 ప్రభాతవార్త: 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత తొమ్మిదిన్నర సంవత్సరాలలో ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాల శాఖ మంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి అర్హులైన పేదలందరికీ ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు, ఆధార్‌కార్డులో సవరణలు, ఆయుష్మాన్‌భారత్, బ్యాంకింగ్ సర్వీసులైన జన్‌ధన్ ఖాతాలు, ముద్రా లోన్స్ తదితర పథకాలు అందే విధంగా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, డివిజన్ అధ్యక్షులు దాసోజు నాగభూషణం, శాంరాజ్, పెంటంరాజు, అబ్బని రమేశ్, గణేష్‌నేత, రాజు నేత, భాస్కర్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, ఈశ్వర్, శ్రావణ్‌కుమార్, తిరుపతి గుప్త, మనోజ్‌యాదవ్, రత్నప్రభ, సరోజమ్మ, రేఖాయాదవ్, ఎస్ఎస్.రెడ్డి, దయాకర్‌యాదవ్, జగన్‌యాదవ్, నర్సింహాగౌడ్, మహేష్, రవీందర్, లక్ష్మణ్,గణేష్ పాల్గొన్నారు.

## గడపగడపకు అక్షింతల వితరణ



అవంతి నగర్ కాలనీ ఈస్ట్‌లో అయోధ్య నుంచి వచ్చిన స్వామి వారి అక్షింతలను పంపిణీ చేస్తున్న కాలనీ అధ్యక్షులు అన్నెం కోటిరెడ్డి

యూసుఫ్‌గూడ, జనవరి 10, ప్రభాతవార్త : అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన శ్రీ రాముల వారి అక్షింతలను గడపగడపకు వితరణ చేయడం జరిగింది. బుధవారం మోతీనగర్ ప్రాంతంలోని అవంతి నగర్ ఈస్ట్ కాలనీలో కాలనీ అధ్యక్షులు లయన్ అన్నెం కోటిరెడ్డి ఆధ్వర్యంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో పాటు కాలనీ వాసులతో ఇంటింటికి వెళ్ళి స్వామి వారి అక్షింతలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ఒక అద్భుతంగా భావించి ప్రతి ఒక్కరు ఈనెల 22వ తేదీన జరిగే స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంని టీవీల ద్వారా వీక్షించి పునీతులు కావాలని కోరారు.. ఈకార్యక్రమంలో మాజీ అధ్యక్షులు అంకం వీరబాబు, ప్రధాన కార్యదర్శి టి.దేవేందర్‌రావు, వీణా కుమారి, సత్యనాదం, ఏలేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, శివకుమార్, శ్రీనువాసరెడ్డి, సుబ్బారావు, రాజు, హరీష్, పాల్గొన్నారు.

## పెండింగ్ చలాన్ల రాయితీని వాహనదారులు వినియోగించుకోవాలి

చిక్కడపల్లి, జనవరి 10 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ చాలన్ల రాయితీ చెల్లింపు గడువును మరో 20 రోజుల పాటు పొడగించిందని, వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.వీరేశం కోరారు. బుధవారంతో గడువు ముగిసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ చెల్లింపు గడువును మరో 20రోజుల పాటు పొడగించిందని, అంటే 31వ తేదీ వరకు పొడగించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వాహనదారులకు గతంలో ఉన్న పెండింగ్ చాలన్లు చెల్లించేందుకు భారీ రాయితీ కల్పించిందని, అందుకు పెనాల్టీదారులు సద్వినియోగం చేసకోవాలని సూచించారు. ఈ సదావకాశాన్ని అర్హులు వినియోగించుకోవాలన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుండిగల్, జనవరి 10 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ జిల్లాకు చెందిన మంగలి కృష్ణ(65) దుండిగల్ మున్సిపాలిటీ పరిధి రాజరాజేశ్వరి కాలనీలో వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబసభ్యులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. టిఎస్08జెఎస్2724 ద్విచక్రవాహనం రిపేరు కావడంతో గండిమైసమ్మ చౌరస్తాలోని మెకానిక్ షాపులో ఇచ్చాడు. మంగళవారం సాయంత్రం మెకానిక్ షెడ్ నుండి బైక్ తీసుకొని కృష్ణ ఇంటికి బయలుదేరాడు. మార్గం మధ్యలో ఉజ్వల రెస్టారెంట్ దాటగానే యూ టర్న్ వద్ద వెనుక నుండి దూసుకువచ్చిన టాటాఏస్(టిఎస్ 08 యుఎఫ్ 0527) బలంగా ఢీకొట్టడంతో కింద పడిపోయిన కృష్ణ టాటాఏస్ టైర్ల మధ్య ఇరుక్కుపోయాడు. తీవ్రగాయాలపాలైన క్షతగాత్రున్ని సూరారంలోని మల్లారెడ్డి వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## 13నుంచి 15 వరకు పరేడ్ మైదానంలో ఇంటర్నేషనల్ కైట్స్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్



బేగంపేట జనవరి 10,ప్రభాతవార్త : తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13నుంచి 15వ తేదీ వరకు ఇంటర్నేషనల్ కైట్స్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్ 2024 ను నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ఇప్పటికే పరేడ్ మైదానంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి.ఇప్పటికే పరేడ్ మైదానంలో షెడ్ల నిర్మాణంతో పాటు ఇతరత్రా పనులు చేపట్టారు.ప్రతి ఏటా తెలం గాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఇంటర్నేషనల్ కైట్స్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్ 2024కు ఈ ఏడాది కూడా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ ఏడాది కూడా ఈ ఫెస్టివల్ కు భారీ స్పందన వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## పెరుగుతున్న చలి తీవ్రత

ఖైరతాబాద్, జనవరి 10 ప్రభాతవార్త: సాగరతీరానికి సమీపంలో ఉన్నటువంటి బస్తీల, కాలనీల ప్రజలు పెరుగుతున్న చలి తీవ్రతకు వణికిపోతున్నారు. ఇటీవల తగ్గుతున్న ఉష్ణోగ్రతలు, అల్పపీడనం వల్ల చలి పెరిగింది. సాయంత్రం, తెల్లవారు జామున విపరీతమైనటువంటి చలి ఉంటోందని చలికి నిండా ముసుగేసుకుని ముదురుకోవాల్సి వస్తోందని కొందరు వృద్ధులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మహాశివరాత్రి వరకు ఇలాగే ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. చలి పుణ్యమా అంటూ కొందరు ఆసుపత్రి పాలవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ చలి కాలంలో ఇంత చలి తీవ్రత అనేది ఐదారు దశాబ్దాల తర్వాత చూస్తున్నామని కొందరు చెబుతున్నారు.

## నగర మాజీ మేయర్‌కు అయోధ్య శ్రీరాముడి అక్షింతలు



భవ్య దివ్వ అయోధ్య అంక్షింతలను తీసుకుంటున్న బండకార్తిక రెడ్డి దంపతులు

తార్నాక, జనవరి 10 ప్రభాతవార్త: నగర మాజీ మేయర్ బండకార్తిక చంద్రా రెడ్డికి అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఆర్ఎస్ఎస్,హిందువాహిణి కార్యకర్తలు బుధవారం ఆమె నివాసంలో అందజేశారు. భవ్య దివ్వ అయోధ్య శ్రీరామ జన్మ భూమి పరమ పవిత్రమైన అంక్షింతలను తాను అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కార్తిక రెడ్డి, బండ చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ శ్రీనివాస్, కుమారి,ఆశ, శ్రీరాం, గోపాల్ చారి, సాయిబాబా(స్వామి), రాముపర్మ, మహేష్,రాజేష్ తధితరులు పాల్గొన్నారు.

## గాయకుడు త్రినాథరావుకు అంతర్జాతీయ గానకళారత్న అవార్డు ప్రదానం

చిక్కడపల్లి, జనవరి 10 ప్రభాతవార్త: అంతర్జాతీయ కళాసాహిత్య సాంస్కృతిక ఆధ్యాత్మిక సేవా సంస్థ మానవతా స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో సుప్రసిద్ధ గాయకుడు చింతలపూడి త్రినాథరావుకు 'అంతర్జాతీయ గానకళారత్న అవార్డు'కు అందించి గౌరవించే కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత ముషిణి రామకృష్ణారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ దేశ విదేశాల్లో త్రినాథరావు అందించిన సంగీత సేవలకు గుర్తింపుగా సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో కూడా తమ సంస్థ ఆధ్వర్యంతో త్రినాథరావుకు 'జీవిత సాఫల్య పురస్కారం' అందించి గౌరవించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ అమెరికాలో కూడా రామకృష్ణారావు 'బాలుపుర్కారం'తో సత్కరించినట్లు గుర్తు చేశారు. తనశేష జీవితం సంగీత సేవకే పునరంకితమవుతామన్నారు.

## కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయండి : బండి రమేష్



బండి రమేష్‌ను కలిసిన సయ్యద్ యూసఫ్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 10, ప్రభాతవార్త : ఎప్పుడు ప్రజా సంక్షేమాన్ని కోరే కాంగ్రెస్ పార్టీని కూకట్‌పల్లి నియోజకవర్గం లో పూర్తిస్థాయిలో బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండి రమేష్ సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఇందిరాగాంధీ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా విజయం సాధించిన నూతన అధ్యక్షుడు సయ్యద్ యూసుఫ్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్‌ను బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి రమేష్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన యూసుఫ్‌ని అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మరింత అభివృద్ధి చెందే విధంగా చూడాలని కాలనీ సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. స్థానికంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందే విధంగా చూడాలని తెలిపారు. ఇందిరాగాంధీపురంకు చెందిన మహ్మమ్మద్ గౌస్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పి బండి రమేష్ పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నవాబు, వాసిముద్దీన్, పప్పు, ఎమ్ము, ఇజాజ్, రవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బి స్టేడియంలో క్రీడా పోటీలు ప్రారంభం



బేగంబజార్,జనవరి 10ప్రభాతవార్త: ప్రతియేటా మాదిరిగానే ఈయేడు కూడా తెలంగాణ నాన్ గజిటెడ్ హైదరాబాద్ ఉద్యోగుల సంఘం ఆద్వర్యంలో 9వ క్రికెట్ క్రీడా ఎంట్రీలను నిర్వహించారు. యట్టం సదానంద్ క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్,ఫైనల్ మ్యాచ్‌లను ప్రొఫెసర్ కోదండరామ్,కాంగ్రెస్ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులందరూ సాధారణ పనులకు అతీతంగా క్రీడలు,ఆటల్లో పాల్గొంటున్నారన్నారు.ఏ ప్రభుత్వానికైనా ఉద్యోగులే వెన్నముక అన్నారు.టిఎన్‌జిఓ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ మాట్లాడుతూ ఉద్యోగులందరి సహకారంతో ప్రతియేటా క్రీడాపోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి విక్రమ్‌కుమార్, కార్యనిర్వాహక అద్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్,గజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు మారం జగదీష్, ఉపాధ్యక్షులు కస్తూరి వెంకట్,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లక్ష్మన్,ఉమాదేవి, సీమా ముజీబ్,బాల్‌రాజ్,కె.శ్రీనివాస్,వైదిక్‌శాస్రిత, ఖలీద్అహ్మద్,గీతా,సుజాత,బి.వెంకట్‌రెడ్డి, ప్రభాకర్,మోహన్,పిఆర్‌ఓ మహమ్మద్ వహిద్ తదితరులు పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన వార్షికోత్సవ సంబురాలు

నాంపల్లి, జనవరి 10 ప్రభాతవార్త : అత్యధిక నాణ్యతా విద్యాప్రమాణాలతో విద్యార్థులకు విద్యాబోధన సాగిస్తున్న డామ్నిక్స్ పాఠశాల 45వ వార్షికోత్సవ వేడుకలు నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు లలితకళాతోరణంలో బుధవారం రాత్రి సంస్కృతి 2024 పేరున డామ్నిక్స్, మార్టిన్స్, డైసీ ఫ్లవర్ పిల్లల సందడి అంగరంగ వైభవంగా జరిగి అంబరాన్నంటాయి. విద్యార్థులకు చదువుతోపాటు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తూ దేశ విదేశీ సంస్కృతి, జీవన విధానాలను ప్రతిబింబింపజేసే అనేక రకాల నృత్యరీతులతో చిన్నారుల నృత్యప్రదర్శనలు విచ్చేసిన అతిథులను, విద్యార్థుల తల్లిదండ్రులను అబ్బురపరుస్తూ ప్రశంసలు అందుకున్నాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ అతిథులు విద్యార్థులకు కేవలం చదువే కాకుండా క్రీడా, సాంస్కృతిక కళాంశాలపై అవగాహన కల్పిస్తున్న డామ్నిక్స్ యాజమాన్య ఔచిత్యాన్ని కొనియాడారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ అంకితారెడ్డి పాఠశాల వార్షికోత్సవ సంబురాల విజయవంతానికి సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సంబురాల్లో పాఠశాల కోఆర్డినేటర్ రాణా, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని వేడుకలను ఆస్వాదించి ఆనందించారు.

## నేత్రపర్వంగా 'శ్రీరాములవారి పవిత్ర పాదుకలు'



చిక్కడపల్లి, జనవరి 10 ప్రభాతవార్త: ఆయోధ్యలోని భవ్యరామమందిరానికి చేరబోయే 'శ్రీరాముల వారి పవిత్ర పాదుకలు' బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్ ఆవరణలో భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అక్కడికి చేరుకుని భక్తిపారవశ్యంతో పారవశ్యంతో పాదుకలను దర్శించుకున్నారు. శ్రీరాములవారి పాదులను పెద్దఎత్తున దర్శించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఫ్లాట్స్ నివాసితులు మురళీ, నాగేందర్, సురేశ్, అనీల్, శ్రీనివాస్, రవి, నాగేందర్, లక్ష్మణ్, నిరంజన్ పాల్గొన్నారు.

## దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష

విధానాన్ని అమలు చేసిందని, దీంతో ఎంతో మంది రైల్వే ఉద్యోగులకు నష్టం కలుగుతోందని తెలిపారు. రైల్వే ఉద్యోగులు, కార్మికులతో భారతీయ రైల్వే సంస్థ కొనసాగుతోందని, ఇలాంటి వారికోసం రైల్వే బోర్డ్, కేంద్ర ప్రభుత్వం స్పందించి రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పింఛన్ అనేది కార్మికుల యొక్క హక్కు అని, దాన్ని కాలరానే అధికారం ఎవరికి లేదని అన్నారు. ఈ కార్యాక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ప్రభాకర్ ఆండ్రూస్, నాయకులు భరణీప్రసాద్, దుద్రారెడ్డి, రావూఫ్ పాల్గొన్నారు.

## నవ్యాంధ్రలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులను తీసుకురావాలి

రాచాల విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగందర్‌గౌడ్

సైఫాబాద్, జనవరి 10 ప్రభాతవార్త: నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పని చేస్తున్న తెలంగాణ ప్రాంత ప్రభుత్వ ఉద్యోగులను తిరిగి రాష్ట్రానికి తీసుకురావాలని బిసి పొలిటికల్ జెఎసి ఛైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ కోరారు. అక్కడి ప్రభుత్వం ఉద్యోగులను తెలంగాణ పంపెందుకు క్లియరెన్స్ ఇచ్చిందని, కాని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 636 మంది ఉద్యోగులను తెలంగాణ రాష్ట్రానికి తీసుకురాకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా కుటుంబాలకు దూరంగా ఉంటూ తెలంగాణ ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసు_న్నారని, ఈ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి మానవతా దృక్పదంతో చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖలో జరిగిన అక్రమ బదిలీలపై విచారణ జరిపించాలని, సాధారణ బదిలీలు, ప్రమోషన్లు గత 5 సంత్సరాల నుంచి జరగలేదన్నారు. నాటి ఎక్సైజ్ శాఖ మంత్రిగా ఉన్న వి.శ్రీనివాస్‌గౌడ్ తనకు అనుకూలంగా ఉన్నవారికే పదోన్నతులు ఇచ్చి కొరుకున్న చోటకు బదిలీ చేశారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని టానిక్ లిక్కర్ మార్ట్‌కు గత ప్రభుత్వం స్పెషల్ జివో ఇచ్చి 5 ఏళ్ళవరకు టెండర్ అనుమతి ఇచ్చిందన్నారు. ఆ షాపుకు బినామిగా రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఉన్నప్పటికి అనిత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ అంశాలపై ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆధారాలతో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. వీటిపైన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని యుగేందర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## గౌలిదొడ్డి నుంచి శబరిమలకు వెళ్లిన అయ్యప్ప స్వాములు



నార్సింగి మున్సిపల్ గౌలిదొడ్డి వివేకానందనగర్ కాలనీ నుంచి శబరిమలకు బయలుదేరుతున్న అయ్యప్ప స్వాములు

నార్సింగి, జనవరి 10 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపల్ గౌలిదొడ్డి వివేకానందనగర్ కాలనీకి చెందిన అయ్యప్ప స్వాములు బుధవారం శాస్రోక్తంగా ఇరుముడులు కట్టుకొని శబరిమలకు తరలి వెళ్లారు. కలియుగ దైవమైన హరిహర తనయుడు అయ్యప్ప నామ స్మరణంతో వివేకానందనగర్ కాలనీ మారుమ్రోగింది. స్వామియే శరణం అయ్యప్ప... అంటూ మాల ధారులు, భక్తులు అయ్యప్ప స్వామి నామ స్మరణం చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి, సీనియర్ బిఆర్ఎస్ నాయకుడు గొల్ల నాగేష్ యాదవ్‌లు పాల్గొని అయ్యప్ప గానామృతంను విని ఉప్పొంగిపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కఠినమైన నిబంధనలు పాటిస్తూ, కటిక నేలపై పవళిస్తూ, చన్నీటి స్నానాలు చేస్తూ అనుక్షణం అయ్యప్ప స్వామి నామ స్మరణం చేస్తూ మాలధారులు చేస్తున్న మండల దీక్ష చాలా పవిత్రమైందన్నారు. ఏటాటా అయ్యప్ప మాలధారణ చేసే భక్తుల సంఖ్య పెరుగుతుండడం, నేటి కంప్యూటర్ యుగంలో సైతం యువత, ఐటీ ఉద్యోగులు అయ్యప్ప మాల వేసుకొని భక్తి పారవశ్యంలో మునిగి తేలడం శుభపరిణామమన్నారు. ఆధ్మాత్మికతను పాటిస్తూ, మన భారతీయ సనాతన ధర్మంను అనుసరిస్తూ ఆధునిక విజ్ఞానంను పెంచుకోవడంపై యువత దృష్టి సారిస్తున్నారన్నారు. అయ్యప్ప నామ స్మరణం ఎంతో పవిత్రమైందని, కలి దోషాలను హరించడం లో హరిహర తనయుడు ముందున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ కాలనీ వాసులు మల్లేష్ యాదవ్, సంతోష్, కొండల్‌రెడ్డి, బసంత్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన డ్రైనేజి పైప్‌లైన్ పనులు ప్రారంభం



నూతన పైప్ లైన్‌కు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పోరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త: నూతన డ్రైనేజి పైప్ లైన్ పనులను అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పోరేటర్ పద్మా వెంకటరెడ్డితో కలసి ప్రారంభించారు. బుధవారం బాగ్ అంబర్‌పేట్ డివిజన్ లోని సీఈ కాలనీలో ఆరు లక్షల నిధులతో చేపట్టిన నూతన డ్రైనేజి పనులను వారు లాంఛనంగా ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే సీఈ కాలనీలో నెలకొన్న డ్రైనేజి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ పద్మావతి డీపీ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్, వాటర్‌వర్క్స్ మేనేజర్ మాజీద్ మరియు బస్తీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువుల పంపిణీ

చిక్కడపల్లి, జనవరి 10 ప్రభాతవార్త: మైనంపల్లి ట్రస్ట్ చైర్మన్ బద్దంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వికలాంగుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబాలకు ఆర్థికసహాయం చేశారు. నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తూవులను పంపిణీ చేసే కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో సినీనటుడు విశ్వ, మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్ తనయుడు అరవింద్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు అభిషేక్, సురేశ్, జగదీశ్, నర్సింగావు, వినయ్, జె.శ్రీకాంత్, అనీల్‌గౌడ్, శివ పాల్గొన్నారు.

## నెంబర్‌ప్లేట్ లేని వాహనదారులపై కేసుల నమోదు

నెంబర్‌ప్లేట్ పెట్టించి విడుదల

చిక్కడపల్లి, జనవరి 10 ప్రభాతవార్త: చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో నెంబర్‌ప్లేట్ లేని వాహనదారులపై స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య బుధవారం ఆధ్వర్యంలో కేసులు నమోదు చేశారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ అందించి నూతన నెంబర్ ప్లేట్ పెట్టించి విడుదల చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో 10 వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేసిన పోలీసులు కేసులు నమోదు చేసి దృవపత్రాలను పరిశీలలించి సరైన నెంబర్ ప్లేట్ పెట్టించి విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐ సీతయ్య మాట్లాడుతూ నెంబర్‌ప్లేట్ లేని వాహానారులు సరైన నెంబర్‌ప్లేట్ వేసుకుని వాహానాలను నడపాలని, నెంబర్‌ప్లేట్ లేకుండా వాహానాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించార

## అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బండిశ్రీనివాస్, నాగరాజు

హైదరాబాద్, జనవరి 10,ప్రభాతవార్త: అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ (ఏటిఏఈఈ)2024 డైరీని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ నాగరాజు,కోశాధికారి సంతోష్‌రెడ్డిల ఆధ్వర్యంలోని ప్రతినిధులు పెద్దఎత్తున సెక్రటేరియట్‌కు తరలివచ్చి మంత్రి చేతులమీదుగా డైరీ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు అనిల్‌సాగర్, వంశీధర్‌గౌడ్, మనోహర్‌బాబు, మొహమ్మద్‌గౌస్, రాఘవేంద్ర, సిద్దార్థ, ఎల్ఎల్ శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల ను పరిరక్షించడంలో పోలీసులతో పాటు ప్రతి పౌరుడు భాగస్వా ములు కావాలి




సనత్‌నగర్ నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన పురేందరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలుపుతున్న నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు నాగుల సత్యం

యూసుఫ్‌గూడ, జనవరి 10, ప్రభాతవార్త : శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీసులతో పాటు ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలని సనత్‌నగర్ నూతన సిఐగా భాద్యతలు చేపట్టిన పురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రామారావునగర్ నుంచి సంక్షేమ సంఘం, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు నాగుల సత్యం ఆధ్వర్యంలో వెళ్ళి సిఐని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రామారావునగర్ అధ్యక్షులు బి.వెంకటయ్య యాదవ్, ఆవుల సంజీవ, పి.అభిషేకం, బి.సాంబశివ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సాధన అవార్డుల పంపిణీ



వేడుక సందర్భంగా అవార్డులను అందుకున్న వారితో సైంటిస్టులు

తార్నాక, జనవరి 10 ప్రభాతవార్త: అంతర్జాతీయ డైటెటిక్స్‌డేను పురస్కరించుకొని బుధవారం తార్నాకలోని ఎన్ఐఎన్‌లో రికగ్నైజింగ్ న్యూట్రిషన్స్ అండ్ డైటీషనియన్స్ సంస్థ ఆద్వర్యంలో సాధన అవార్డ్స్‌ను రిడైటీషియన్స్‌కు అందజేశారు. పోషకాహారంపై పరిశోధనలు, విశిష్ట సేవలందించిన డైటీషియన్స్‌కు సాధన అవార్డ్స్ ఫౌండర్ డా.జానకి బదుగు ఆద్వర్యంలో పలువురికి శాలువాలు కప్పి అవార్డులను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జానకి బదుగు,యశోధ హాస్పిటల్ డైటీషియన్ డా.సుజాత స్టీఫెన్ మాట్లాడుతూ వివిధ కేటగిరిలో ఉన్న 36 మందిని బెస్ట్ డైటీషియన్స్, బెస్ట్ న్యూట్రిషన్‌లను గుర్తించి వారికి ఆవార్డులను, సర్టిఫికెట్లను అందజేసినట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంప్ వాక్‌తో పాటు డ్యాన్సులు, పాటలతో న్యూట్రీషియన్స్, డైటిషియన్స్ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. హేమలత,నిజాం వారసుడు నవాబ్ రోనక్ యార్ ఖాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## వైభవంగా సిరిముచ్చ కల్చరల్స్ నాటకోత్సవం



భజరప్ప రంగస్థల పురస్కారంతో స్నిగ్ధను సత్కరిస్తున్న బలరామమూర్తి, డిఎస్ఎన్.మూర్తి, హారిశ్చంద్ర, బుజ్జి, కోటేశ్వరరావు

నాంపల్లి, జనవరి 10 ప్రభాతవార్త : రచయిత అన్నవాడు అమాయకంగానే ఉండాలని, అలా పైకి ఎంత అమాయకత్వం కనిపించినా లోపల ఎవరెస్ట్ శిఖరమంత ప్రజ్ఞ ఉన్న రంగస్థల రచయిత గోపి సత్యప్రకాష్ (స్నిగ్ధ) అని, ఆయన వ్రాసిన నాటికలు చాలా సందేశాత్మకంగా ముచ్చటగా ఉంటాయని, నా అంతవాడు లేడనే భావనొస్తే ఆ నాటిక చెడిపోతుందని ప్రముఖ రచయిత, నటుడు కె.వి.బలరామమూర్తి అన్నారు. సిరిముచ్చ కల్చరల్స్ హైదరాబాద్ నిర్వహణలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో బుధవారం రాత్రి సిరిముచ్చ కల్చరల్స్ నాటకోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ముందుగా కెజెఆర్ కల్చరల్స్ అసోసియేషన్, సికిందరాబాద్ వారిచే ఉదయ్ భాగవతుల రచన దర్శకత్వంలో రూపొందిన సాహితీసూక్తం నాటిక, సభానంతరం ఎ.సోమశేఖర్ రచన, మంజునాథ దర్శకత్వంలో రూపొందిన హక్కు నాటికలు అద్భుతంగా ప్రదర్శింపబడ్డాయి.

## అత్తాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం కృషి

కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్



అభివృద్ధి పనుల శంకు స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 10 ప్రభాతవార్త : అత్తాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ అన్నారు.అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆమె శ్రీ కారం చుట్టారు.హరినాథ్‌రెడ్డి కాలనీలో స్థానిక ప్రజలు కోసం 13 లక్షల రూపాయలతో నిర్మించనున్న వాకింగ్ ట్రాక్ ప్రహరీ గోడ పనులకు ఆమె శంకు స్థాపన చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ మాట్లాడుతూ డివిజన్ అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటు పడుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ నరసింహా మూర్తి,బిజెపి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య,బిజెపి నాయకులు రాచూరి రాజశేఖర్,కాడెం సుధాకర్, బీటుకూరి సిద్దేశ్వర్,ఎల్.వెంకటేష్,వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజుతో పాటు బస్తీ వాసులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతీ లబ్ది దారునికి సంక్షేమ పథకాలు

యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ ఇంఛార్జీ కె.రవిరాజ్



సమావేశంలో పాల్గొన్న యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కె.రవిరాజ్,కాంగ్రెస్ నాయకులు

చార్మినార్,జనవరి 10 ప్రభాతవార్త : పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రవేశ పెట్టిందని యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ కె.రవిరాజ్ అన్నారు.రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు మేరకు పాతబస్తీ గౌలిపురలో బుధవారం యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గం ఇంఛార్జీ రవిరాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల లోను అభివృద్ధి సాధిస్తుందన్నారు. టిపిసిసి కార్యద ర్శులు అల్లం భాస్కర్, కె.శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రాజు యాదవ్, ఎం.శ్రీనివాస్, జిలావర్,కె.సుభాష్,గోవర్దన్,డి.శ్రీనివాస్,కొండ నలిని గౌడ్,యువజన కాంగ్రెస్ నాయకులు కె.లడ్డు,శశి యాదవ్,కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు అల్లం రాకేష్,మల్లిఖార్జున్,రాహుల్,ఖదీర్,నూర్ పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి రూ.పది కోట్ల నిధులు



సిఎం రేవంత్‌రెడ్డితో బేటి అయిన మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ నేతలు

**ఉప్పల్, జనవరి 10 ప్రభాతవార్త :** తెలంగాణలో ప్రతి నియోజకవర్గానికి రూ. పది కోట్ల నిధులు కేటాయించడం అభినందనీయమని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం.పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు సిఎం రేవంత్‌రెడ్డితో బేటి అయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు సమస్యలు గుర్తించే పనుల్లో నిమగ్నం కావాలని సిఎం సూచించినట్లు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గానికి కూడా పది కోట్లు మంజూరు చేస్తున్నారని, నిధులు సక్రమంగా వినియోగించే క్రమంలో ఇంచార్జ్‌లు కీలక పాత్ర పోషించాలని సూచించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని, నియోజకవర్గం అభివృద్ధికి నిధులు ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్లమెంట్ పరిధిలోని పార్టీ ఇంచార్జ్‌లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవులను 'సేవాదళ్'కు కేటాయించాలని వినతి : జితేందర్



దీపాదాస్ మున్షికి వినతిపత్రం అందజేస్తున్న సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్

**సైదాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** నామినేటెడ్ పదవుల్లో తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ బుధవారం తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇంఛార్జి దీపాదాస్ మున్షికి వినతిపత్రం అందజేశారు. అనంతరం జితేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలోనే భర్తీ చేయనున్న కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర నామినేటెడ్ పదవులను సేవాదళ్ సభ్యులకు కేటాయించాలని కోరడం జరిగిందన్నారు.

## 13న శ్రీగోదారంగనాథుల కల్యాణ మహోత్సవం

**హైదరాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ మారుతినగర్‌లోని శ్వేత గార్డెన్లో ఈనెల 13వ తేదీన శ్రీగోదారంగనాథుల కళ్యాణం మహోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ లక్ష్మీనారాయణ సేవా సమితి ధార్మిక, ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థ నిర్వాహకురాలు గురుమాతా దివ్యశ్రీ రమణచక్రవర్తుల పేర్కొన్నారు. కళ్యాణ మహోత్సవం కరపత్రాలను కొత్తపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదా అంటే గోవు, వాక్కు, ధనము, భూమి, ఆయుషు, ఆనందము, అధికారం ఇలా చాలా అర్థాలు వస్తాయని తెలిపారు. శ్రీ గోదారంగనాథల కళ్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి డైరెక్టర్ వెంకటరమణాచార్యులు, సభ్యులు గండి భాస్కర్, ఎం.వెంకటాచార్య, అనిత, మౌనిక, లావణ్య, నక్క రాంబాబు పాల్గొన్నారు.

## రంగవల్లులతో అలరించిన మహిళామణులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జగదీష్, రమేష్

**హైదరాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్‌కాలనీలోని శ్రీలక్ష్మి వైట్ హౌస్ షాపింగ్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మహిళలు పెద్దఎత్తున హాజరై అందమైన ముగ్గులను పోటాపోటీగా వేశారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన ప్రథమ బహుమతి సిరి, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి వైటవ్ షాపింగ్ మాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది జగదీష్, ప్రధానకార్యదర్శి తడ్క రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శివసాయినగర్‌లో మహా మృత్యుంజయ హోమం

**సరూర్‌నగర్, జనవరి 10 ప్రభాతవార్త:** మీర్‌పేట్ శివసాయినగర్‌లోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. మార్గశిర మాసం మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సనాతన ధర్మ ప్రవర్ధక సమితి ఆధ్వర్యంలో మహా మృత్యుంజయ హోమాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. అంతకు ముందు ఉదయం సాయంత్రం లఘున్యాసపూర్వక, మహాన్యాసపూర్వక ఏకాదశవార రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## యువత ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి : ప్రొఫెసర్ దిలీప్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ దిలీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అప్పారావు

**మలక్‌పేట, జనవరి 10 ప్రభాతవార్త:** యువత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని మాజీ ఇన్ఫర్‌మేషన్ కమిషనర్, ప్రొఫెసర్ దిలీప్‌రెడ్డి పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్‌లోని అవంతి పిజి కళాశాలలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని యువ జాతీయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దిలీప్‌రెడ్డి గౌరవ అతిథిగా విచ్చేసి కసిరెడ్డి వెంకటరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు, హెచ్‌ఆర్ డైరెక్టర్ జయప్రదలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య విజ్ఞానాన్ని అందిస్తుందని, తద్వార విచ్చే విజ్ఞానాన్ని ఇచ్చే గురువులను గౌరవించాలన్నారు. యువత సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. అనంతరం అతిథులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా అంతర్ కళాశాల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో రవినాయుడు, శకుంతల, అబ్దుల్ హుస్సేన్, రమణమూరి , ప్రొఫెసర్ పద్మజ, ఎట మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సెలవులకు ఊరెళ్తున్నారా?.. జర జాగ్రత్త: ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి



దొంగతనాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఇన్స్‌పెక్టర్ వెంకట్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 10 ప్రభాతవార్త:** సంక్రాంతి పండుగ సందర్భంగా స్వంత ఊర్లకు వెళ్తున్నారా.. జర జాగ్రత్త అంటున్నారు బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ బి.వెంకట్‌రెడ్డి. పండుగ సెలవుల సందర్భంగా పిఎస్ పరిధిలోని పలువురు ప్రజలు గ్రామాలకు వెళ్లే వారికి ఆయన సూచనలు చేశారు. ఈ మేరకు ఆయన దొంగతనాల నివారణ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం ఎస్ఐ యూసుఫ్ జానీ, మొబైల్ పెట్రోలింగ్ సిబ్బంది, బిసి4 స్టాఫ్‌తో కలిసి వివిధ ఎర్రకుంట, టూర్ కాలనీల్లో పాదయాత్రలు చేస్తూ చైతన్యం కల్పించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ ఊర్లకు వెళ్ళాల్సివస్తే ఇంట్లో నగలు, నగదు ఉంచకుండా బా ్యంకు లాకర్లలో గానీ లేక ఇంట్లోనే రహస్య ప్రదేశంలో భద్రపరుచుకోవాలని సూచించారు. వాకిట్లో ఉదయం పూట ముగ్గులు వేసేటప్పుడు ధరించిన నగలపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అదే విధంగా దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన ముఖ్య జాగ్రత్తలను ఆయన వారికి వివరించారు. పోలీసుల సూచనలు తప్పకుండా పాటిస్తే చోరీలు జరిగే అవకాశమే ఉందని వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రధానం : జిన్నారం విఠల్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** భాగ్యనగర్ మహిళా సంఘం అధ్యక్షురాలు ఉప్పల నిర్మల, సెక్రెటరీ ప్రశాంతిగుప్తా, కోశాధికారి చింతల పావని ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ హనుమాన్‌నగర్‌కాలనీలో మంగళవారం సంక్రాంతి పర్వది నం సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల కార్యక్రమా నికి ముఖ్యఅతిథులుగా చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, ముసరాంబాగ్ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి పాల్గొని ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అదేవిదంగా వికలాంగులకు దుప్పట్ల పంపిణీ, నూతన సంవత్సరం కాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రమణరెడ్డి, కనుకదుర్గ టెంపుల్ డైరెక్టర్ జయశ్రీ, కమిటీ సభ్యులు శ్రీవాణి చౌదరి, చికోటి సరోజ, బ్రహ్మలక్ష్మి, పద్మారెడ్డి, శ్రీదేవి, విజయలక్ష్మి, కవిత, ఇందిరాభారతి, నాగలక్ష్మి, శారదా, శాంత, భారతమ్మ, జయలక్ష్మి, విజయ, వరలక్ష్మి, సత్యకుమారి, శైలజ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

**తార్నాక, జనవరి 10 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తార్నాక డివిజన్‌లో హనుమాన్‌నగర్‌లో చేపట్టిన సీసీరోడ్డు పనులను వారు పరశీలించారు. అనంతరం డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీలు చేయాలని సూచించారు. డివిజన్‌లో మరికొన్ని ప్రాంతాల్లో త్వరలో సీసీ రోడ్లను వేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు స్థానికులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## సింగరేణి సిఎండికి దీప్‌లాల్ అభినందనలు

**సరూర్‌నగర్, జనవరి 10 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సింగరేణి కాలరీస్ సిఎండిగా నియమితులైన బలరాంనాయక్‌కు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఎఐబిఎస్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు దీప్‌లాల్‌చౌహాన్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన మాజీ ఎంపి అజ్మీరా సీతారాం నాయక్, ఎఐబిఎస్ఎస్ అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్ నాయక్, అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.మోహన్‌సింగ్, కార్యదర్శి సోమ్లా నాయక్, పలువురు బంజారా నాయకులతో కలిసి బలరాం నాయక్‌ను శాలువాతో సన్మానించి మొక్క కుండీని జ్ఞాపికగా అందజేసి అభినందనలు తెలిపారు.

## ప్రజా పాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రక్రియను పరిశీలించిన అధికారులు



ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న ఆర్డీఓ

**సరూర్‌నగర్, జనవరి 10 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల జరిగిన ప్రజాపాలన దరఖాసు_ల స్వీకరణ సందర్భంగా ప్రభుత్వ గ్యారంటీ పథకాల కోసం ప్రజలు సమర్పించిన దరఖాస్తుల కంప్యూటరీకరణ చురుకుగా సాగుతున్నది. కమీషనర్ వాణిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మీర్‌పేట్‌లోని టిఆర్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో దరఖాస్తుల కంప్యూటీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని కందుకూరు డివిజన్ ఆర్డీఓ సూరజ్‌కుమార్, ప్రజాపాలన మహేశ్వరం నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌రెడ్డిలు కమీషనర్ వాణిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు డాటా ఎంట్రీ ఆపరేటర్లు చేస్తున్న దరఖాసు_ల కంప్యూటరీకరణ ప్రక్రియను పర్యవేక్షించి సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ నూకల వెంకట్‌రెడ్డి, ఆర్ఓ డి.అంజన్‌రెడ్డి, ప్రజాపాలన పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి కృషి : లక్ష్మారెడ్డి

**ఉప్పల్, జనవరి 10 ప్రభాతవార్త :** క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రామంతాపూర్ పూనంభవన్‌లో క్రిస్టియన్ పీస్ట్ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న నాగేశ్వర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. జ్యోష్న నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీలకు బిఆర్ఎస్ ప్రభుత్వం తగు చేయూత అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముస్తాక్, శ్రీకాంత్‌గౌడ్, జహంగీర్, శాగ రవీందర్, సూరం శంకర్, చాంద్‌పాషా, ప్రశాంత్‌గౌడ్, ఆలే రమేష్, కాలేరు జైనవీన్, పలువురు సంఘం నేతలు పాల్గొన్నారు.

## చేనేత కళాకారులకు ప్రభుత్వం చేయూత



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి చేనేత మగ్గంపై వేసిన చిత్రాన్ని బహుకరిస్తున్న పద్మశాలి సంఘం నేతలు

**ఉప్పల్, జనవరి 10 ప్రభాతవార్త :** చేనేత వృత్తిపై ఆదారపడి జీవిస్తున్న కళాకారులకు ప్రభుత్వం తగు చేయూత అందిస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం చిలుకానగర్ డివిజన్ మాజీఅధ్యక్షుడు చేర్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు పద్మశాలి సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలి కులస్థులకు ఆర్థికంగా, సామాజికంగా రాణించాలని సూచించారు. పద్మశాలిలకు ఏ కష్టం వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కుల సంఘాల నాయకులు వల్లాల కృష్ణ ప్రసాద్, చేర్యాల బాలకిషన్, మాటాటి యాదగిరి, బిఆర్ఎస్ నాయకులు గడ్డం పాపిరెడ్డి, ఎం.డి.మహుమూద్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంపట్ల హర్షం

**తుర్కయాంజాల్, జనవరి 10 ప్రభాతవార్త:** స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటి హర్షం వ్యక్తం చేసింది. వడ్డెర వృత్తిదారుల సంఘం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షులు నర్ర పాండు అధ్యక్షతన సమావేశం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గౌరవాధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశులు హాజరై మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నేటికి 76 సంవత్సరాలు అవుతున్నా వడ్డెర్లను ఏ ప్రభుత్వం గుర్తించిన దాఖలు లేవని సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి వడ్డె ఒబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ప్రభుత్వం వడ్డెర ఫెడరేషన్‌కు చైర్మన్‌ను నియంచాలని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వనర్ దేరంగుల రామకృష్ణ మాట్లాడుతూ వడ్డెర వృత్తిదారులకు భీమా సౌకర్యం కల్పించి, గుట్టలపై క్వారీలపై పూర్తి హక్కులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండికోట సత్యం, తన్నీరు సైమన్, దేరంగుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నందిహిల్స్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్ శివపార్వతి నర్సింహ

**సరూర్‌నగర్, జనవరి 10 ప్రభాతవార్త:** మీర్‌పేట్‌కార్పొరేషన్ నందిహిల్స్ బస్టాప్ వద్ద బుధవారం మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. నందిహిల్స్ ఫేజ్-1 అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్ని అందమైన ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో విజేతలుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా లక్ష్మీప్రసన్న, నాగగాయత్రి, ఆర్.స్వాతిలు నిలిచారు. పోటీల అనంతరం ముఖ్యఅతిథులుగా హాజరైన 9వ డివిజన్ కార్పొరేటర్ పెంద్యాల శివపార్వతి, మీర్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పెంద్యాల నర్సింహ, గిరిజనమోర్చా రాష్ట్రనేత బెల్లంకొండ నాగరాజులు హాజరై విజేతలకు నగదు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ గౌరవాధ్యక్షుడు డి.నాగేశ్ యాదవ్, ఎం.దుర్గయ్య, జగన్మోహన్‌రావు, నల్లా వెంకటేశ్వర్, రఘునాథ్‌రెడ్డి, శేఖర్, లక్ష్మణ్, మురళీచారి, రాంచందర్‌యాదవ్, విక్కీ సాగర్‌లు పాల్గొన్నారు.

## రాగన్నగూడ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన రాగన్నగూడ ముదిరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులు

**తుర్కయాంజాల్, జనవరి 10 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసారు. అధ్యక్షుడిగా ఢిల్లీ జగదీశ్వర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా పళ్ళ వెంకటయ్య, జనరల్ సెక్రెటీరీగా ఎడ్ల వెంకటేష్, జాయింట్ సెక్రెటరీగా ఖమ్మం రమేష్, కోశాధికారిగా ఎడ్ల దానయ్య, ముఖ్య సలహాదారుడిగా పిట్టల నరేష్, ఢిల్లీ పాండు, సభ్యులుగా గోదాసు నరేష్, కానమని వెంకటేష్, రెడ్డమోని సాయి కుమార్, చింతకాయల యాదగిరి, ధనమోని నరేష్, గడిగ యాదగిరి, కోర్ని శివ, పాలమోని సాయికిరణ్, పుల్లగాజుల నరేష్‌లను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జగదీశ్వర్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మారుతినగర్‌లో అబ్బురపరిచిన మహిళల ముగ్గుల పోటీలు : లింగాల రాహుల్‌గౌడ్





ముగ్గులను పరిశీలిస్తున్న లింగల నాగేశ్వరరావు, రాహుల్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ మారుతినగర్ జైన్ మందిర్ వద్ద బుధవారం కొత్తపేట డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, మారుతినగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో మహిళలు, బాలికలు పెద్దఎత్తున పాల్గొని అందమైన రంగవల్లులతో ఆకట్టుకున్నారు. పలువురు మహిళలు పలు సందేశాత్మకమైన ముగ్గులను వేసి అబ్బురపరిచారు. పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు మల్లేశం, మురళీధర్‌రావు, రామారావు, బి.రమేష్, అనూరాధ, సతీష్, శంకర్‌రావు, సత్యనారాయణ, పద్మ, కృష్ణారెడ్డి, శశి, నర్సింగ్, అనిల్, సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలు ఇచ్చారు - ఇండ్లు ఇవ్వండి

### ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డికి లబ్ధిదారుల వినతి



ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

**హైదరాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** డబల్ బెడ్ రూమ్‌లకు సంబంధించి పట్టాలు ఇచ్చారని వెంటనే ఇండ్లను ఇవ్వాలని మహేశ్వర నియోజకవర్గం డబల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు డిమాండ్ చేశారు. డబల్‌బెడ్‌రూమ్ వెంటనే తమకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డిని పలువురు లబ్ధిదారులు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న తమకు డబల్‌బెడ్‌రూమ్ కేటాయింపు జరిగిందని ఎన్నికల కారణంగా కొద్దిరోజులుగా తమకు పొజిషన్ చూపించడం లేదని తాళాలు కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు పూర్తయి నెల దాటిన తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని తమకు కేటాయించిన డబల్‌బెడ్‌రూమ్ పొజిషన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో మంజుల, సక్కుబాయి, ఉమారాణి, సంధ్యా, హైమావతి, శోభారాణి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్లను నల్ల బజారుకు తరలిస్తే జైలు శిక్ష : మాచన రఘునందన్



గ్యాస్ సిలిండర్ల సరఫరాపై డీలర్లు నిఘా పెట్టాలని సూచిస్తున్న రఘునందన్

**తుర్కయాంజాల్, జనవరి 10 ప్రభాతవార్త:** గ్యాస్ డీలర్లు రీఫిల్ డెలివరీపై దృష్టి పెట్టకపోతే గిడ్డంగిలో అవకతవకలు అక్రమాలు జరిగేందుకు అవకాశం లేకపోలేదని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసిల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు ఈ సందర్భంగా ఆయన తుర్కయాంజాల్‌లో మాట్లాడుతూ.. గ్యాస్ డీలర్లు అప్రమత్తంగా లేకపోవడంవల్ల గిడ్డంగి నుంచి వెళ్లే రీఫిల్‌లు ఎటు వెళ్తున్నాయో తెలియని స్థితి నెలకొంటుందన్నారు. ఇటీవల వనస్థలిపురం, పహాడిషరీఫ్ ఠాణా పరిధిలో నమోదైన కేసుల ఉదంతంలో డీలర్ల అలసత్వం వల్లే గ్యాస్ బండలు నల్ల బజారుకు తరలుతున్నాయని ఆరోపించారు. అందుకే గ్యాస్ సిలిండర్ల సరఫరాపై డీలర్లు నిఘా పెట్టాలని సూచించారు. గ్యాస్ బండలను అక్రమంగా నల్ల బజారుకు తరలించే గ్యాస్ డెలివరీ బాయ్‌లను అరెస్టు చేయడం ఖాయమని మాచన రఘునందన్ హెచ్చరించారు. అలాగే గ్యాస్ డెలివరీ బాయ్‌లు చేసే తప్పులకు తాము భాధ్యులం కామని తప్పించుకోవాలని చూస్తే, డీలర్లపై కూడా చర్యలు తీసుకోవడం ఖాయమని హెచ్చరించారు.

## జిహెచ్ఎంసి కమిషనర్‌తో ఎమ్మెల్యే బేటి



జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రాస్‌తో బేటి అయిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, జనవరి 10 ప్రభాతవార్త :** జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తిచేయాలని, రోడ్ల తవ్వకాల విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కొత్త పనులు సకాలంలో చేపట్టి పూర్తి చేయాలని, మధ్యలో వదిలివేసి ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేయవద్దని సూచించారు. చర్లపల్లిలో ఇటీవల జరిగిన నాలాలో రసాయనాల వల్ల పేలుడు సంభవించిందని, ఎప్పటికప్పుడు చెత్తా చెదారం తొలగించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

## నిరుపేద ప్రజల సంక్షేమంకోసం కేంద్ర ప్రభుత్వం కృషి : సంరెడ్డి సురేందర్‌రెడ్డి



నిత్యావసర సరుకులను అందజేస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, జనవరి 10 ప్రభాతవార్త:** ప్రజల సంక్షేమంకోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని పోచమ్మ బస్తీలో వికసిత భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కలుగడంతోపాటు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రధాని మోడి చేపట్టిన ఈ యాత్రలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలగురించి వ్యాన్‌లో ఎల్ఇడి స్క్రీన్ ద్వారా ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపారు. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి మోడి చేపట్టిన కార్యక్రమాన్ని వివరించారు. అయుష్మాన్ భారత్ వారి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అదే విధంగా అబ్దిదారులకు నిత్యావసర సరుకులను అందజేసారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఉపేందర్‌రెడ్డి, ఎస్‌బిఐ ఛీఫ్ మేనేజర్ విక్రమ్ వరుణ్‌కుమార్, రాజేశ్వర్‌జోషి, నాయకులు వేమూరి రాంకోటేశ్వరరావు, సుభాష్ చందర్‌జీ, రాజేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీపంట్నం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన మల్‌రెడ్డి రంగారెడ్డిని మలక్‌పేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, సిపిఐ నాయకుడు మన్నన్ తదితరులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్చాలు శాలువాతో ఘనంగా సన్మానించారు. (ప్రభాతవార్త, మలక్‌పేట)